
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

సోమవారం 17 జూన్ 2024



ఏజెన్సీలో తగ్గిన ఉష్ణోగ్రతలు

పాడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతు పవనాల ప్రభావంతో వాతావరణంలోని మార్పుల కారణంగా ఏజెన్సీలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. పాడేరులో 34 డిగ్రీల సెల్సియస్, అనంతగిరిలో 33.2, ముంచంగిపుట్టులో 32.2, చింతపల్లిలో 32, హుకుంపేటలో 27.7, అరకులోయలో 26.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాడేరు, పరిసర ప్రాంతాల్లో చిరుజల్లులు పడగా పలు ప్రాంతాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది.

వీడిన రాజకోట రహస్యం

రుషికొండపై ఇంద్ర భవనాన్ని మీడియాకు చూపించిన ఎమ్మెల్యే గంటా

కళ్లు చెదిరే నిర్మాణాలతో అవాక్కైన జనం



రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనం

- జగన్ కోసం ఆధునికత ఉట్టిపడేలా సామగ్రి
- ఫ్యాన్ నుంచి బాత్రూమ్ కమోడ్ వరకు ఖరీదైనవే
- ఏడు బ్లాకుల్లో సాగిన నిర్మాణాలు
- ఒక్కో బ్లాక్‌కు రూ.కోట్లలో వ్యయం
- అడ్డగోలు భవనంలో ఎన్నెన్నో విచిత్రాలు



ప్యాలెస్‌లో సువిశాలమైన హాల్

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మోజుపడి, నిబంధనలను తోసి రాజని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ గుట్టు వీడింది. రాజమహల్‌ను తలదన్నే రీతిలో అత్యాధునిక హంగులు, ఆర్భాటాలతో ఏడు బ్లాకుల్లో నిబంధనలకు విరుద్ధంగా, కోర్టులను బురిడీ కొట్టించి మరీ సాగించిన నిర్మాణాలను భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రజలకు ... మిగతా 5వ పేజీలో

నత్తనడక

సా..గుతున్న వంద పడకల ఆస్పత్రి నిర్మాణం



- నిధులు విడుదల కాక చేపట్టని పనులు
- బిల్లులు విడుదల చేయని వైసీపీ ప్రభుత్వం
- మొక్కుబడిగా పది మంది కార్మికులతో పనులు
- వసతి సమస్యతో రోగులు, వైద్యులకు ఇబ్బందులు
- నూతన ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు



నిర్మాణ పనులు జరగని ఆస్పత్రి మెయిన్ బ్లాక్

చింతపల్లి, జూన్ 16: స్థానిక వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం మొక్కుబడిగా కేవలం పది మంది కార్మికులతో పనులు చేయిస్తున్నారు. దీంతో వంద పడకల ఆస్పత్రి నూతన భవనాలు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయోనని వైద్యులు, రోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించడంతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతాయని ప్రాంతీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లికి వంద పడకల ఆస్పత్రిని 2018లో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. తొలుత ఏపీఆర్ కళాశాల దిగువన ఐదు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఆస్పత్రికి కేటాయించిన స్థలం ఏపీఎఫ్‌డీసీకి చెందినదని సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ స్థల వివాదం కారణంగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2020లో వంద పడకల ఆస్పత్రికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నూతన భవనాల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.22 కోట్లను మంజూరు చేసింది. 2020 ఆగస్టులో ఈ పనులను టెండర్ ద్వారా నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ దక్కించుకున్నది. అదే ఏడాది అక్టోబరులో నిర్మాణ పనులు ప్రారంభించాల్సి వున్నప్పటికీ స్థల వివాదం కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ఆస్పత్రి నిర్మాణానికి రెవెన్యూ అధికారులు గతంలో కేటాయించిన స్థలాన్ని రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా అంతర్లలో పట్టు పరిశ్రమ శాఖకు చెందిన 4.5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అప్పగించింది. దీంతో చింతపల్లి వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు 2021 ఆఖరులో ప్రారంభమయ్యాయి. టెండర్ నిబంధనల ప్రకారం 2023 డిసెంబరు నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనులు ఆలస్యంగాప్రారంభించడం వల్ల 2024 మార్చి నెల వరకు గడువు పొడిగించారు. భవన నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎంఎస్ఐడీసీకి అప్పగించారు.

ఆది నుంచి మందకొడిగా పనులు



పనులు జరగని ఆస్పత్రి వార్డు భవనం

ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణాలు ప్రారంభం నుంచి నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేయడం వల్ల పనులు వేగవంతం కాలేదు. భవన సముదాయాల నిర్మాణం కోసం కనస్ట్రక్షన్ కంపెనీ ఇప్పటి వరకు రూ.7 కోట్లు ఖర్చు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం రూ.4.5 కోట్లు బిల్లు మాత్రమే విడుదల చేసింది. మిగతా రూ.2.54 కోట్ల బకాయి చెల్లించాలని గత ప్రభుత్వానికి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు బిల్లులను పంపించినప్పటికీ పది నెలలైనా విడుదల కాలేదు. దీంతో మార్చి నెలలో నిర్మాణ సంస్థ పనులను నిలిపి వేసింది. దీంతో ప్రాంతీయుల ... మిగతా 6వ పేజీలో

పాడేరులో పండగ సందడి!

మోదకొండమ్మను దర్శించుకున్న భక్తులు

- ఉత్సవాలు ముగిసిన తొలి ఆదివారం కావడమే కారణం
- 'అమ్మవారి పాదాల'కు భక్తుల తాకిడి



ఘాట్‌లో అమ్మవారి పాదాలు వద్ద భక్తుల హడావిడి

పాడేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ అమ్మ వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దీంతో పట్టణంలో పండగ సందడి నెలకొంది. ఈనెల 9, 10, 11 తేదీల్లో మోదకొండమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో స్థానిక భక్తులు ఉత్సవాలు అనంతరం వచ్చే ఆదివారం తమ ఇంటి పండగలను నిర్వహించుకుంటారు. దీంతో ఉత్సవాలు ముగిసిన తొలి ఆదివారం కావడంతో స్థానిక మోదకొండమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి అధికంగానే విచ్చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం లోపల నుంచి రోడ్డుపైకి సైతం భక్తులు వరుస కట్టారు. అలాగే మొక్కులున్న భక్తులు ఘటాలను అమ్మవారికి సమర్పించారు. దీంతో మోదకొండమ్మ ఆలయం ఆవరణతో పాటు పాడేరు పట్టణంలోనూ ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఘాట్‌లో 'అమ్మవారి పాదాల'కు భక్తుల తాకిడి

స్థానిక ఘాట్‌లోని అమ్మవారి పాదాలు ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మోదకొండమ్మ ఉత్సవాలకు ముగిసిన తొలి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చారు. దీంతో అమ్మవారి పాదాలు దర్శనానికి భక్తులు బారులు తీరారు. అలాగే మొక్కులు తీర్చుకుని అక్కడే వంటలు, భోజనాలు చేసుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో అమ్మవారి పాదాలు పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

పల్లాకు పట్టాభిషేకం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు
- విశాఖ జిల్లాకు పెద్దపీట
- ఉత్తరాంధ్ర నుంచి మూడో వ్యక్తికి పార్టీలో కీలక పదవి



విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీ పదవి నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో ఆ పదవిలో పల్లా శ్రీనివాసరావును నియమించాలని అధినేత చంద్రబాబు మూడు రోజుల క్రితమే నిర్ణయించి, ఆ విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే ఆదివారం ... మిగతా 6వ పేజీలో

ఉద్యోగాల పేరిట టోకరా

గిరిజనుల నుంచి రూ.5.4 లక్షలు వసూలు చేసిన కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు

- అటెండర్ల పోస్టులకు నకిలీ ఆర్డర్లు
- ఒక నెల జీతం ఖాతాలో జమచేసి, మాయ చేశారని ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



ఉద్యోగాల పేరిట మోసపోయిన గిరిజన యువకులు

కొయ్యూరు, జూన్ 16: ఉద్యోగాలిప్పిస్తామంటూ గిరిజన నిరుద్యోగులను తరచూ మోసం చేస్తునే ఉన్నారు. ఈ కోవలో విజయవాడకు చెందిన కేర్ ఫౌండేషన్ పేరుతో కొంతమంది గిరిజన నిరుద్యోగులను మోసం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మేరకు కొండగోకిరి పంచాయతీ కొత్త పాడి గ్రామానికి చెందిన బాధితుడు పాట్టిక మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నాలుగో తరగతి ఉద్యోగాలిప్పిస్తామంటూ విజయవాడకు చెందిన కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు భాను, శ్రీకాంత్‌రెడ్డి తన వద్ద నుంచి రూ.90 వేలు తీసుకున్నారని తెలిపాడు. తనలాగే మండలంలో బకులూరు పంచాయతీ నెల్లిపూడికి చెందిన పొట్టిక రాజబాబు రూ.1.5 లక్షలు, రావణాపల్లి గ్రామానికి చెందిన పాడి రాజేశ్వరి నుంచి రూ.1.9 లక్షలు, నాతవరం మండలం శరభవరం గ్రామానికి చెందిన రేగాటి ఏసుబాబు రూ.1.1 లక్షలు వసూలు చేశారని తెలిపాడు. ఉద్యోగాలు ఇప్పించడంలో జాప్యం చేస్తూ రేపు.. మాపు.. అంటూ ఏడాదిన్నరగా తిప్పారని తెలిపాడు. వారి చుట్టూ కాళ్ల అరిగేలా తిరగగా కొంత కాలానికి వేర్వేరు చోట్ల ప్రభుత్వ కార్యాలయాలలో అటెండర్ ఉద్యోగాలకు ఫేక్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అంతేకాకుండా ఒక నెల జీతం మా బ్యాంకు ఖాతాలలో వేసి మభ్యపెట్టారన్నాడు. తర్వాత జీతం వేయలేదని, ఈ విషయం కేర్ ఫౌండేషన్ ప్రతినిధులకు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదన్నాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించి ఆదివారం కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు మల్లేశ్వరరావు తెలిపాడు.

కనువిందు చేసిన స్నోయగం



వర్షాలు కురుస్తుండడంతో మన్యంలో పొగమంచు అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. రెండు రోజులుగా గన్నెల జంక్షన్ వ్యూపాయింట్ లోయ పొగమంచుతో పాల సముద్రాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసి సందర్శకులు మైమరచిపోతున్నారు. ఈ మంచు అందాలు అరకులోయ, పరిసర ప్రాంతాల్లో డిసెంబరు వరకు కనువిందు చేస్తునే ఉంటాయి. -అరకులోయ

తప్పిన ఘోర ప్రమాదం

బొర్రా గుహలకు వెళ్లే దారిలో 80 అడుగుల పైనుంచి జారిపడ్డ వ్యాన్

- రక్షణ గోడకు, కొండకు మధ్య చిక్కుకున్న వాహనం
- పర్యాటకుల కారు బోనట్‌పై పడిన వ్యాన్‌లోని కేబుల్ చుట్టలు
- వ్యాన్ డ్రైవర్, కారులోని పర్యాటకులు సురక్షితం



రిటైనింగ్ వాల్‌కు, కొండకు మధ్య చిక్కుకున్న వ్యాన్

అరకులోయ, జూన్ 16: బొర్రా గుహలకు వెళ్లే రహదారిలో కేబుల్ వైర్ల లోడ్‌తో వెళుతున్న వ్యాన్ 80 అడుగుల పైనుంచి లోయలోకి జారిపోయింది. అయితే వ్యాన్ రోడ్డు రిటైనింగ్ వాల్‌కు, కొండ అంచుకు మధ్య చిక్కుకుంది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బొర్రా గుహలు సమీపంలో చోటుచేసుకుంది. వ్యాన్‌లో ఉన్న కేబుల్ చుట్టలు దిగువ రోడ్డు నుంచి వెళుతున్న గుంటూరు పర్యాటకులు ప్రయాణిస్తున్న కారు బోనట్‌పై పడ్డాయి. అదే కారుపైన పడి ఉంటే నుజ్జునుజ్జు అయ్యేది. కారులో ఉన్న నలుగురు ప్రయాణికులు క్షేమంగా బయట పడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్ డ్రైవర్ దూకేయడం, వ్యాన్ కాంక్రీట్ రక్షణ గోడకు, కొండ అంచుకు మధ్య పడడంతో పెను ప్రమాదం తప్పింది.

బొర్రా రైల్వే క్రాసింగ్ సమీపంలో జరుగుతున్న టన్నెల్ పనులకు కేబుల్‌ను విశాఖపట్నం నుంచి వ్యాన్‌లో తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అనంతగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు అంచనాలు తయారు చేయండి

» ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు



సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 16: నియోజకవర్గంలో చేయాల్సిన పెండింగ్ పనులు ఏమైనా ఉంటే త్వరగతిన అంచనాలు తయారు చేయించాలని మాజీ మంత్రి, నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆదివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్నప్రాతుడు మాట్లాడుతూ.. పార్టీలో పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యమిస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో అందరూ కష్టపడి పని చేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మెజార్టీలు చదివి వినిపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో మెజార్టీ తగ్గిందని, ఎందుకు జరిగిందో సమీక్షించుకోవాలని అన్నారు. నర్సీపట్నం మండలం, మునిసిపాలిటీలో పెండింగ్ పనులు అంచనాలు తయారు చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అన్న క్యాంటీన్ భవనం త్వరగా సిద్ధం చేయాలని ఆర్డీవో జయరాంతో అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు లాలం శ్రీరంగ స్వామి, టీడీపీ నాతవరం మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ జాలమూరి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ సందర్శించిన ఆర్డీవో

నర్సీపట్నం రెవెన్యూ డివిజినల్ అధికారి హెచ్‌వీ జయరాం స్థానిక అన్న క్యాంటీన్ భవనాన్ని మునిసిపల్ డీఈఈ నారాయణతో కలిసి పరిశీలించారు. త్వరగతిన పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మోదకొండమ్మ జాతరకు సకల ఏర్పాట్లు

» 18న అంగరంగ వైభవంగా అమ్మవారి పండుగ
» గ్రామంలో విద్యుత్ వెలుగులు, కటౌట్లు
» అదనపు బస్సు సర్వీసులు, పటిష్ట పోలీసు బందోబస్తు



మాడుగుల, జూన్ 16 : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల ప్రాంత ప్రజల ఇలవేల్పు భక్తుల కొంగుబంగారమైన మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం జూన్ 18న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ స్థాయిలో విద్యుద్దీకరణ చేపట్టారు. మాడుగుల మోదకొండమ్మ ఆలయం నుంచి మొదలుకొని శతకంపట్టు వరకు, చోడవరం రోడ్డులో గల వెంకటేశ్వర స్వామి ఆలయం, మోదమాంబ కాలనీ, దాసరివీధి, జగ్గన్న చావడి పురవీధుల్లో భారీ విద్యుద్దీప అలంకరణ చేశారు. ప్రధాన కూడళ్లలో భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. దీంతో మాడుగుల కేంద్రంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా కమిటీ చర్యలు తీసుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి పండుగ నేపథ్యంలో రెండు రోజుల కిందట మాడుగుల ఎమ్మెల్యేగా గెలిచిన బండారు సత్యనారాయణ మూర్తి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక బస్సులు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలంటూ సూచించారు.

పండుగ కార్యక్రమాలు..

అమ్మవారి జాతర సందర్భంగా ఈ నెల పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 17వ తేదీన డ్యాన్స్ మస్తీ డాన్స్, 18న శతకంపట్టు వద్ద డ్యాన్స్ హంగామా, ఎన్టీఆర్ కళాక్షేత్రం స్టేజ్ వద్ద డ్యాన్స్-2024, జగ్గన్న చావిడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జవ్వాదిగెడ్డ జంక్షన్ వద్ద సినీ నృత్యప్రదర్శన, దాసరవీధిలో సూపర్ డూపర్ డ్యాన్స్, గవరవీధిలో డ్యాన్స్ మస్తీ, రావిచెట్టు జంక్షన్‌లో డ్యాన్స్ ఉత్సవ్, జవ్వాదిగెడ్డ జంక్షన్ వద్ద తోలుబొమ్మలాట, ఆదేరోజు రాత్రి 7 గంటల నుంచి దసరా స్టేజీపై వీరాభిమన్యు, భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయభారం బుర్రకథ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా ఫ్లయింగ్ హనుమాన్ డ్రోన్ ద్వారా గ్రామంలో తిప్పుతారు. సింహాద్రి తీన్‌మార్ నిర్వహిస్తారు.

రాళ్లు తేలిన రహదారిపై ఇక్కట్లు

» అధ్వానంగా మారిన సోమునాయుడుపాలెం-మూల స్వయంభూవరం రోడ్డు
» రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
» ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



సోమునాయుడుపాలెం వద్ద రాళ్లు తేలిన రహదారి



స్వయంభూవరం సమీపంలో దుస్థితి

పరవాడ, జూన్ 16: మండలంలోని సోమునాయుడుపాలెం నుంచి మూల స్వయంభూవరం మీదుగా కలపాక వెళ్లే రహదారి దారుణంగా మారింది. ఎక్కడికక్కడ గుంతలు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా సోమునాయుడుపాలెం, మూల స్వయంభూవరం, స్వయంభూవరం, కలపాక గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, వాహనదారులు నిత్యం వెళ్లి వస్తుంటారు. రహదారి శిథిలమై ఏళ్ల గడుస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేకపోయారు. దీనికితోడు ఇరువైపులా ముళ్లపొదలు కారణంగా రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముళ్లపొదల కారణంగా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి రహదారికి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోవాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

పెందుర్తి నియోజకవర్గాన్ని అదర్శంగా తీర్చిదిద్దుతా!

» యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
» సుజల స్రవంతి, చెరకు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
» కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ సీఎం రమేష్



ఎంపీ రమేష్‌ను సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

సబ్బవరం, జూన్ 16 : అనకాపల్లి జిల్లాలోనే తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించిన పెందుర్తి నియోజకవర్గానికి అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇచ్చి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఇరువాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో తనను ఆదరించిన ప్రజలకు, కార్యకర్తలకు, నేతలకు అందుబాటులో ఉంటానన్నారు. స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకుంటానని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాకారానికి, చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దేశంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు ప్రారంభమైనా ఏపీలో కూడా అది ఉండేలా తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ తప్పులు మనం చేయకుండా, రౌడీ మూకలను తొక్కిపెడదామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పెందుర్తి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. మూడు రాజధానుల సీఎంకు ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. కేంద్రంతో మాట్లాడి పెట్రో వర్సిటీకి నిధులు తేవాలని, సబ్బవరంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నందున పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని ఆయన కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకూ ఉన్న రూరల్ మండలాలను వీఎంఆర్‌డీఏలో విలీనం చేసేలా కృషి చేయాలన్నారు. దీని వలన ఆయా మండలాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, జనసేన సబ్బవరం కన్వీనర్ కర్రి కనకరాజు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, కూటమి నేతలు ఎం.మహాలక్ష్మీనాయుడు, భరణికాన బాబూరావు, బలిరెడ్డి అప్పారావు, గండి దేముడు, ముత్యాలనాయుడు, శరగడం రాము, బంతికోళ్ల పద్మ, గొర్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన మంత్రి అనిత



అనితను పుష్పగుచ్ఛంతో సత్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్



అనితకు చిత్రపటాన్ని అందిస్తున్న కొణతాల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కొత్తూరు, జూన్ 16 : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ఇక్కడ మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాలను కలిసి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కొణతాల ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. అలాగే, అనకాపల్లి జాతీయ రహదారి వద్ద ఉన్న బీజేపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ సీఎం రమేష్‌ను మంత్రి అనిత కలిసి ఆశీర్వాదం పొందారు. ఆమెకు సీఎం రమేష్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రి వర్గంలో అత్యంత కీలకమైన శాఖ బాధ్యతలు స్వీకరించిన అనితకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ అభివృద్ధిపై త్వరలో అఖిలపక్ష సమావేశం

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కేఎస్ఎన్ఎస్ రాజును కలిసిన గోవాడ షుగర్స్ కార్మికులు

చోడవరం, జూన్ 16: గోవాడ షుగర్స్ సమస్యల పరిష్కారంతో పాటు ఫ్యాక్టరీ అభివృద్ధికి అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యేగా గెలిచిన కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆదివారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో కేఎస్ఎన్ఎస్ రాజును కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ త్వరలోనే ఫ్యాక్టరీపై రైతుల్లో నమ్మకం పెంచేలా ఫ్యాక్టరీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్షం సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీని ఆదుకోవడంతో పాటు పూర్వవైభవం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అల్లం రామప్పారావు, తలారి సత్యనారాయణ, ఏడువాక నారాయణరావు, హరిహర రావు, శ్యాం,సంతోష్, రామకృష్ణరాజు, దుస్సు రమణ, వసాది రమణ, పెంటారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన గణేష్ గాయత్రి బ్రాహ్మణసేవాసంఘం సభ్యులు స్థానిక గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం నేతులు మర్యాదపూర్వకంగా కేఎస్ఎన్ఎస్ రాజును కలిసి అభినందనలు తెలిపారు. రాజును కలిసిన వారిలో ఎం.వీరన్నపంతులు, కందర్ప రమణమూర్తి, మూర్తి, విస్సు, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కందర్ప రామేశం, చలపతిరావు ఉన్నారు.



ప్యాలెస్‌లోకి ప్రవేశిస్తున్న ఎమ్మెల్యే గంటా, తదితరులు



విద్యుత్ కాంతుల నడుమ విశాలవంతమైన గదులు

వీడిన రాజకోట రహస్యం

... 3వ పేజీ తరువాయి

చూపించే ప్రయత్నం చేశారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని మరీ ప్యాలెస్‌కు వెళ్లిన గంటా.. ఏడు బ్లాకుల్లో నిర్మితమైన భవనాల్లోని అనువణువును బయట ప్రపంచానికి బహిర్గతం చేశారు. తానో నిరు పేదను అన్నట్టుగా కలరింగ్ ఇచ్చే జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత విలాసవంతంగా ప్రజాధనంతో నిర్మించిన రాజమహల్‌లోని బాత్రూమ్ కూడా సాధారణ ప్రజలు నివసించే ఇంటికి రెండింతలు ఉండడం గమనార్హం.

మూడేళ్లుగా నిర్మాణం

గడిచిన మూడేళ్లుగా సాగుతున్న ఈ భవన నిర్మాణం గురించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ నిర్మాణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అధికారిక ప్రకటన చేయలేదు. ఒక్కోసారి ఒక్కో రీతిన ప్రకటనలు జారీచేసినా.. వాటిలో ఏది నిజమో ఇప్పటికీ తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు కొద్దిరోజులు ముందు అప్పటి పర్యాటకశాఖ మంత్రి రోజా హడావిడిగా ఈ భవనాలను ప్రారంభించి వెళ్లిపోయారు. అయితే, దీనిని దేనికి వినియోగిస్తారన్న విషయం మాత్రం చెప్పలేదు.

అంతర్జాతీయస్థాయిలో...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుషికొండపై నిర్మించిన రాజమహల్ గుట్టును గంటా బయటపెట్టారు. రూ.500 కోట్ల వ్యయంతో ఏడు బ్లాకుల్లో రుషికొండపై అత్యంత విలాసవంతంగా జగన్ నిర్మించుకున్న భవనాన్ని ఆసాంతం పరిశీలించారు. ఇందులోని ప్రతి వస్తువు అత్యంత ఖరీదైనదే. బాత్రూమ్ నుంచి బెడ్రూమ్ వరకు, హాల్ నుంచి కిచెన్ వరకు.. ప్రతిచోటా వినియోగించిన సామగ్రి, ఫర్నిచర్ కళ్లు చెదిరే రీతిలో ఉన్నాయి. ఇటాలియన్ మార్బుల్ గోడలు, ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో బాత్రూమ్ ఫిటింగ్స్, ఒళ్లు పట్టించుకోవడానికి మసాజ్ (స్పా) రూములు, భారీ సైజు పడక గదులు, విశాలమైన కారిడార్లు.. ఇలా చెప్పుకుంటూపోతే ఇంద్ర భవనాన్ని తలపించేలా రీతిలో వసతులను ఏర్పాటు చేయించారు. వందలాది మందితో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా కాన్ఫరెన్స్ హాళ్లు, ఫైళ్ల భద్రపరిచేందుకు లాకర్లు ఏర్పాటు చేశారు. ఏడు బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టగా, వీటన్నింటినీ సొంతానికి వినియోగించుకునేలా డిజైన్ చేయడం గమనార్హం. ఆయా బ్లాకులకు పెట్టిన పేర్లు కూడా రాచరిక వ్యవస్థను గుర్తుచేసేలా ఉండడం మరో విశేషం. భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేశారు. ఈ దృశ్యాలను టీవీలు, సోషల్ మీడియాలో చూసిన ప్రజలు అవాక్కయ్యారు. ప్రజల డబ్బుతో జగన్ తన స్వార్థం కోసం ఇంతటి భవనం నిర్మించుకున్నారనే విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.



ప్యాలెస్‌లోని మసాజ్ టేబుల్, బాత్‌రూమ్స్

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూ లైన్లలో కోలాహలం

అనకాపల్లి టౌన్, జూన్ 16 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక ఆరంభమైంది. ఆరు గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలు కల్పించారు. భక్తులతో క్యూ లైన్లు కిటకిటలాడాయి. ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంత కొబ్బరితోటల్లో భక్తులు వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా భక్తుల తాకిడి తగ్గలేదు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఆలయ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


రంగురాళ్ల క్వారీ పరిశీలించిన పోలీసులు



ఆరిలోవలో క్వారీని పరిశీలించిన ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ, జూన్ 16 : అటవీప్రాంతలో రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరిపిన క్వారీని ఎస్ఐ కృష్ణారావు ఆదివారం పరిశీలించారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్లతో కూడిన మట్టిని గుట్టుగా శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిగాయని పలు పత్రికల్లో వచ్చిన కథనాలు రావడంతో పోలీసులు స్పందించారు. మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ధన్వంతరీ వనం ప్లాంటేషన్ వద్ద రంగురాళ్ల క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు రంగురాళ్ల తవ్వకాలు జరిపినట్లు ప్రచారం జరిగింది. దీంతో సుమారు రెండు లక్షల రూపాయల విలువల గల రంగురాళ్లు లభ్యమైనట్లు మండలంలోని జోరుగా ప్రసారం సాగుతోంది. రంగురాళ్లను నర్సీపట్నంలో వ్యాపారులు విక్రయాలు జరిగినట్లు ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడడంతో కొంతమంది రంగురాళ్ల తవ్వకాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. క్వారీని పరిశీలించిన అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ.. కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. దీంతో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిలకడగా కోనాం జలాశయం నీటిమట్టం



కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, జూన్ 16: మండలంలో కోనాం జలాశయంలో ఉన్న నీటిమట్టం నిలకడగా ఉంది జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి 95.60 మీటర్లకు చేరుకుంది. కోనాం జలాశయం ఎగువ నుంచి 70 క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువ కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీరు లీకేజీ రూపంలో వృథాగా పోతోంది. గత ఏడాది ఇదే రోజున 95.20 మీటర్లు నీటిమట్టం ఉందని ఏఈ జయరాం తెలిపారు.

కోనాంలో ఆరు అడుగుల నాగజెర్రి హతం



స్థానికులు హతమార్చిన నాగజెర్రి

చీడికాడ, జూన్ 16: కోనాం గ్రామంలో గల చెక్ పోస్టు వద్ద ఆరు అడుగుల నాగజెర్రిని గ్రామస్థులు హత మార్చారు. చుట్టామను షులు ఉన్న సమయంలో వేరొక చోట నుంచి రోడ్డు మీదుగా ఆరు అడుగుల నాగజెర్రి ఆదివారం మధ్యాహ్నం హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనతో కర్రలతో కొట్టి హతమార్చారు. ఇది సుమారు ఆరు అడుగులు ఉంటుందని అంచనా వేశారు.

కొండకర్ల ఆవ వద్ద 'తండేల్' షూటింగ్ సందడి

» నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా పలు సన్నివేశాలు చిత్రీకరణ

అచ్యుతాపురం రూరల్, జూన్ 16: మండలంలోని కొండకర్ల ఆవ వద్ద ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నాగచైతన్య, సాయి పల్లవి హీరో, హీరోయిన్లుగా తెరకెక్కిస్తున్న 'తండేల్' చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కించారు. 2018లో శ్రీకాకుళం మత్స్యకారులకు జరిగిన సంఘటనను సినిమాగా చిత్రీకరిస్తున్నారు. గుజరాత్ రాష్ట్రం నుంచి చేపల వేట కోసం బయల్దేరిన 22 మంది శ్రీకాకుళం మత్స్యకారులు పాకిస్తాన్ సముద్ర సరిహద్దుల్లో అధికారులకు చిక్కి 17 నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించిన వారి జీవిత కథ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని కథా రచయిత కార్తీక్ తీడ తెలిపారు. గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే 70 శాతం పూర్తయిందన్నారు. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా డిసెంబరు 20న విడుదల కానుందన్నారు షూటింగ్‌ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పరిసర గ్రామాల నుంచి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కూటమి నాయకులు

ఐదు సంతకాలు... పంచ అద్భుతాలు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో కూటమి నేతలు

కొయ్యూరు, జూన్ 16: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు పెట్టిన ఐదు సంతకాలు రాష్ట్ర భవిష్యత్తుకు పంచ అద్భుతాలని కూటమి నేతలు అభివర్ణించారు. మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయ భవన ఆవరణలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డీఎస్సీ నిరుద్యోగులకు వరమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు శుభపరిణామంగా అభివర్ణించారు. ఎన్టీఆర్ పెన్షన్ భరోసా రూ.4 వేలకు పెంచడం అవ్వాతాతల కళ్లల్లో వెలుగు నింపుతుందన్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ననాయకులు గొలుసింగి సత్యనారాయణ, రామూర్తి, వై.వరహాలబాబు, బి.శివరామరాజు, ఏలూరి రత్నం, సర్పంచులు పీటా సింహాచలం, మాకాడ బాలరాజు, మేడిబోయిన చిన్న, అప్పలరాజు, అరిమెల రాజు, ఆర్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన టీడీపీ నేతలు



మంత్రి సంధ్యారాణికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

పాడేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం సాలూరులోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ డివిజన్ నేత పాంగి పాండురంగస్వామి, అరకు పార్లమెంటరీ స్థానం అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాగర సుబ్బారావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ, నాయకులు లక్ష్మయ్య, వెంకటరావు, శంకరరావు తదితరులు మంత్రి సంధ్యారాణిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవాలు



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

హుకుంపేట, జూన్ 16: స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ తదితరులు అమ్మవారి విగ్రహం, ఘటాలను తలకెత్తుకుని ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అమ్మవారి విగ్రహాన్ని, ఘటాలను ఆలయం నుంచి ఊరేగింపుగా శతకంపట్టు వద్దకు తీసుకువెళ్లి, అక్కడ ప్రతిష్ఠించారు. మూడు రోజులు అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆఖరి రోజు మంగళవారం అనుపోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో సర్పంచ్ సమిడ పూర్ణిమ, ఉప సర్పంచ్ గోవింద్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తరలించరూ..



ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..

హుకుంపేట, జూన్ 16: మండల కేంద్రమైన హుకుంపేట మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చెసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడేరు-అరకు ప్రధాన రహదారిలో రోడ్డుకు అడుగు దూరంలో మాత్రమే ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణం సాగించే వ్యక్తులు రాత్రి సమయాల్లో గుర్తుపట్టలేక ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనాలతో ఢీకొని గాయాల పాలయ్యారని అంటున్నారు. వర్షాలు, భారీ గాలులు వీచినప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు వెదజల్లుతుంటాయని, దీంతో ఇటు వైపుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారని వాపోయారు. మండల కేంద్రంలోనే ప్రతి శనివారం భారీ వారపు సంత జరుగుతుందని, గిరిజనులు వివిధ సరుకులు తెస్తుంటారని, దీంతో ఈ ప్రాంతంలో ఆ రోజు వాహనాలు ఎక్కువగా నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు తరలించాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!

▸▸ కోతకు గురైన బంగారుపుట్టు ప్రధాన రహదారి



కోతకు గురైన బంగారుపుట్టు రోడ్డు

పెదబయలు, మే 16: మండలంలోని పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో బంగారుపుట్టుకు వెళ్లే మార్గం ఎదురుగా ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. సుమారు నాలుగు అడుగుల మేర లోతు ఏర్పడడంతో అటుగా ప్రయాణించే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. గోమంగి, బొంగరం, పొయ్యిపల్లి, గుల్లెలు, ఇంజరి, లింగేటి, బొండాపల్లి, గిన్నెలకోట పంచాయతీల ప్రజలు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. వాహన చోదకులు ఏమాత్రం అజుమరిచి ప్రయాణించినా భారీ నష్టం జరిగే అవకాశాలు లేక పోలేదు. పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురించిన పట్టించుకున్న పాపానికి పోలేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అంతేకాకుంగా జి.మాడుగుల మండలానికి చేరుకోవాడానికి సులువైన మార్గం కావాడంతో తరచూ వాహనాలు రద్దీగా తిరుగుతుంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన రహదారిని మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ధారాలమ్మ ఘాట్ రోడ్డు

▸▸ రహదారిలో ఎక్కడికక్కడే గతుకులు

▸▸ భయాందోళనలో వాహన చోదకులు

▸▸ పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



గోతులమయమైన ధారకొండ ఘాట్ రహదారి

సీలేరు, జూన్ 16: గూడెంకొత్తవీధి మండలంలోని ధారాలమ్మ ఘాట్ రోడ్డు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఎక్కడికక్కడ గోతుల మయం కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో ప్రతీ ఆదివారం, మంగళవారం, శుక్రవారం ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వాహనాల్లో వస్తుంటారు. దీంతో పాటు ఇది అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ఒడిశాలోని పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. అయితే ఆర్వీ గనర్ నుంచి నూతిబంద వరకు, సప్పర్ల రేయిన్ గేజ్ దిగువ నుంచి ధారాలమ్మ ఆలయం మధ్యలోని రహదారి పెద్ద పెద్ద గోతుల కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్లు ఇంజన్‌లు గోతుల్లో పడి ఎక్కడ మరమ్మతులకు గురవుతాయోనని, కారడవిలో ఎప్పుడు నిలిచిపోతాయోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి పట్ల నిర్లక్ష్యం వహించడంతో అధ్వాన స్థితికి చేరుకుంది. కొత్త ప్రభుత్వమైనా చొరవ చూపి రహదారిని అభివృద్ధి చేయాలని, లేదా గోతులను పూడ్చించేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీలేరులో ఏపీ జెన్‌కో సీఈ విస్తృత పర్యటన

▸▸ యూనిట్ల పనితీరు, విద్యుదుత్పత్తిపై ఆరా



జల విద్యుత్ కేంద్రంలో యూనిట్ల పరితీరును పరిశీలిస్తున్న సీఈ జవహర్

సీలేరు, జూన్ 16: సీలేరులో ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జవహర్ ఆదివారం విస్తృంగా పర్యటించారు. ఇటీవల బాధ్యతలను చేపట్టిన ఆయన ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మొదటిసారిగా సీలేరు విచ్చేయగా, జెన్‌కో ఇంజనీర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గుంటవాడ రిజర్వాయర్, రెగ్యులేటర్ డ్యాం, ఇంటెక్ డ్యాంలను పరిశీలించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రానికి చేరుకుని జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై స్థానిక ఇంజనీర్లను ఆరా తీశారు. మొదటి యూనిట్ సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోవడంతో పనులను అభిరామ కంపెనీకి అప్పగించామని, అనుమతులు రావాల్సి ఉండడంతో పనులు ఇంకా ప్రారంభించలేదని ఇంజనీర్లు తెలిపారు. మిగతా మూడు యూనిట్లు వినియోగంలోనే ఉన్నాయని, గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు ఉత్పత్తి జరుగుతుందని డీఈ వివరించారు. ఒకటో నంబర్ యూనిట్ మరమ్మతు పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సీఈ ఆదేశాలు జారీ చేశారు. యూనిట్ మరమ్మతులకు ఒక షెడ్యూల్‌ను రూపొందించుకుని, దానికి అనుగుణంగా పనులు చేపడుతూ ఎప్పటికప్పుడు రిపోర్టును తనకు అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంజనీర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఈ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ (సివిల్) కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ (ఓఅండ్ఎం) బి.బాలకృష్ణ, ఈఈలు ప్రభాకరరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జలపాతాల్లో పర్యాటకుల సందడి





కొత్తపల్లి జలపాతంలో సందడి చేస్తున్న పర్యాటకులు

గుంజివాడ జలపాతాన్ని తిలకిస్తున్న సందర్శకులు

ముంచంగిపుట్టు, జూన్ 16: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దు ప్రాంతం గిన్నెలకోట పంచాయతీ గుంజివాడ సమీపంలో ప్రవహిస్తున్న జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఎత్తయిన గిరులపై నుంచి ప్రవహిస్తున్న జలపాతం సౌందర్యాన్ని చూసేందుకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా పర్యాటకులతో కళకళలాడింది. కొంత మంది పర్యాటకులు జలపాతం వద్ద వంటావార్పు చేసుకొని భోజనాలు చేశారు. గంటలు తరబడి జలపాతం నీళ్లలో జలకాలాడుతూ ఆస్వాదించారు.

కొత్తపల్లి జలపాతంలో...

జి.మాడుగుల, జూన్ 16: ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు కొత్తపల్లి జలపాతం అందాలను తిలకించి ఆస్వాదించారు. వేసవి సెలవులు పునఃప్రారంభం కావడంతో పర్యాటకుల తాకిడి కాస్త తగ్గింది.

షరతులు లేకుండా కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీచేయాలి

ముంచంగిపుట్టు, జూన్ 16: ఎటువంటి షరతులు లేకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ కోరారు. ఈ పత్రాలు జారీ చేయాలంటే సొంత కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారని, అవి లేని వారికి పత్రాలు జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు లేకపోయేసరికి వారికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం రాలేదు, ఇపుడు రేషన్ కార్డుల్లో పేరు లేదని, కుటుంబ సభ్యుల పాత ధ్రువీకరణ పత్రాలు లేవని రిజక్ట్ చేయడం అన్యాయమని అన్నారు. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం పిల్లల తల్లిదండ్రులు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అధికారులు స్పందించి ఎటువంటి షరతులు లేకుండా కుల, ఆదాయ పత్రాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

పిడుగుపాటుకు 13 ఆవులు మృత్యువాత



పిడుగు పాటుకు మృతి చెందిన ఆవులు

హుకుంపేట, జూన్ 16: మండలంలోని సూకూరు పంచాయతీ కేంద్రానికి సమీపంలో అడవుల్లో పిడుగు పాటుకు 13 ఆవులు మృతి చెందాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సూకూరుకు చెందిన ఎనిమిది మంది రైతులు తమ పశువులను మేత కోసం సమీపంలోని అడవుల్లోకి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆ ప్రాంతంలో అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో పశువులు ఓ చెట్టు కింద చేరాయి. అదే సమయంలో పిడుగుపడడంతో 13 పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. అయితే అదష్టవశాత్తూ అక్కడున్న రైతులకు ఎటువంటి గాయాలు కాలేదు. తమకు జీవనాధారమైన పశువులు మృతితో తీవ్రంగా నష్టపోయామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత గిరిజన రైతులు కోరుతున్నారు.

లక్కవరంలో మూడు పశువులు...



మృతి చెందిన పశువులు

చింతపల్లి: మండలంలోని కిటుముల పంచాయతీ లక్కవరం గ్రామంలో పిడుగుపాటుతో రెండు పశువులు, ఒక మేక మృతి చెందారు. ఆదివారం యథావిధిగా మేత కోసం పశువులు, మేకలను కాపరి గ్రామ శివారు కొండ వద్దకు తీసుకొని వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పిడుగులతో పాటు భారీ వర్షం కురిసింది. వర్షానికి ఓ చెట్టుకిందవున్న పశువులపై పిడుగు పడడంతో లక్కవరం గ్రామానికి చెందిన వంతల రాజుబాబు పశువులు, మేక మృతి చెందాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

నక్కపల్లి, జూన్ 16 : మండల కేంద్రం నక్కపల్లికి చెందిన కర్రి శ్రీను (26) అనే గీత కార్మికుడు ఆదివారం చెట్టుపై కల్లుతీస్తుండగా ప్రమాదవ శాత్తూ జారిపడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కుగా వున్న శ్రీను మృతితో అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులను కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు, పెద్దలు పరామర్శించారు.

మూడు ఆలయాల్లో చోరీకి యత్నం

చోడవరం, జూన్ 16 : మండలంలోని జుత్తాడ పంచాయతీలో మూడుగుళ్లలో దొంగలు చోరీకి ప్రయత్నించారు. గ్రామంలోని నూకాలమ్మతల్లి, పట్టాలమ్మతల్లి, ఆంజనేయ స్వామి గుడులలో తాళాలు విరగగొట్టి దొంగతనాలకు ప్రయత్నించారు. స్థానికుల అలికిడితో దొంగలు పారిపోయినట్టు చెపుతున్నారు. గుడులలో దొంగతనాలపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

నత్తనడక

... 3వ పేజీ తరువాయి

నుంచి విమర్శలు రావడంతో నిధులు విడుదల చేయకపోయినా వైసీపీ ప్రభుత్వం కనస్ట్రక్షన్ కంపెనీపై పనులు కొనసాగించాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో కనస్ట్రక్షన్ కంపెనీ మూడు నెలలుగా మొక్కుబడిగా పనులు చేపడుతున్నది. గతంలో వందల మంది కార్మికులు భవన నిర్మాణ పనులు చేపట్టేవారు. ప్రస్తుతం కేవలం పది మందితో నామమాత్రంగా పనులు చేయిస్తున్నారు. భవనాల నిర్మాణాల గడువు ముగిసిపోయినప్పటికి ప్రస్తుతం కేవలం 30 శాతం పనులు మాత్రమే జరిగాయి.

ఇబ్బంది పడుతున్న వైద్యులు, రోగులు

చింతపల్లి వంద పడకల ఆస్పత్రిని నిర్వహిస్తున్న ప్రస్తుత భవనంలో వైద్యులు, రోగులు వసతి సమస్యను తీవ్ర స్థాయిలో ఎదుర్కొంటున్నారు. ఒకే గదిలో నలుగురు వైద్యులు కూర్చోని సేవలందిస్తున్నారు. రోగులకు సరిపడిన వార్డులు లేవు. చిన్నగదిలో ఆపరేషన్ థియేటర్‌ని నిర్వహిస్తున్నారు. ప్రసూతి, ల్యాబ్‌ల నిర్వహణకు వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లికి వంద పడకల ఆస్పత్రి మంజూరైందని ప్రాంతీయులు సంతోష పడ్డారు. అయితే నూతన భవన నిర్మాణాలు ఆలస్యం కావడంతో ప్రాంతీయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మారడంతో చిగురిస్తున్న ఆశలు..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయని ప్రాంతీయులు ఆశ పడుతున్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో పాడేరు మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు పలు రకాల భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ భవనాలు పూర్తి చేయడం ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి సాహసమనే చెప్పాలి. ఏది ఏమైనప్పటికి చంద్రబాబు నైపుణ్య పరిపాలనలో గిరిజన ప్రాంతానికి పెద్దపీట వేసి అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తారని ప్రాంతీయులు అంటున్నారు.

పల్లాకు పట్టాభిషేకం

... 3వ పేజీ తరువాయి

అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

తాజా ఎన్నికల్లో రాష్ట్రంలోనే గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. పదవుల పంపకంలో సమీకరణల నేపథ్యంలో పల్లాకు మంత్రి పదవి రాలేదు. ఈ నేపథ్యంలో పార్టీలో అత్యున్నతమైన రాష్ట్ర అధ్యక్ష పదవిని అధినేత కట్టబెట్టారు. వెనుకబడిన యాదవ సామాజికవర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో ఉంది. పల్లా తండ్రి సింహాచలం 1994లో విశాఖ-2 నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లా శ్రీనివాసరావు 2020 నుంచి విశాఖ పార్లమెంటు అధ్యక్షునిగా సుమారు నాలుగేళ్లు పనిచేశారు. ఇదిలావుండగా ఉత్తరాంధ్ర నుంచి కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి వరించిన మూడో వ్యక్తి పల్లా శ్రీనివాసరావే. ఈ ముగ్గురు కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం.

☛ సంక్షిప్తంగా..

ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం హాజరు ఉండాలి

▸▸ ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి

చింతపల్లి, జూన్ 16: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ చింతపల్లి, జీకే వీధి మండలాల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలకు పూర్తి స్థాయి విద్యార్థులు హాజరుకాలేదన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ ద్వారా సమాచారం పంపించామన్నారు. సోమవారం నాటికి విద్యార్థులందరూ పాఠశాలలకు హాజరుకాకపోతే విద్యార్థుల గృహాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ విద్యార్థి పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. హెచ్‌డబ్ల్యూవో, హెచ్ఎంలు విద్యార్థుల పూర్తి స్థాయి హాజరు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఇప్పటికే పుస్తకాలు, దుస్తులు పంపిణీ జరుగుతుందని, విద్యాబోధన కూడా ప్రారంభమైందన్నారు. ఈ మేరకు గృహాల్లో ఉన్న విద్యార్థులను వెంటనే పాఠశాలలకు తీసుకొచ్చి అప్పగించాలని తల్లిదండ్రులను ఆమె కోరారు.

ఏజెన్సీలోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయాలి

చింతపల్లి, జూన్ 16: గిరిజన ప్రాంతంలోనూ అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోఫోకాన్ కరాటే జిల్లా ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే పేదల కడుపు నింపేందుకు దోహదపడే అన్న క్యాంటీన్ల నిర్వాహణపై సంతకం చేయడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అన్నా క్యాంటీలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో చింతపల్లి, పాడేరు, అరకువేలి, రంపచోడవరం ప్రాంతాల్లోనూ అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే గిరిజన పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో క్యాంటీన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

19న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

కొయ్యూరు, జూన్ 16: చింతపల్లి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీజీఎఫ్ఆర్, ఏపీఈపీడీసీఎల్ సంయుక్తంగా ఈ నెల 19న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేదికకు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర్య సభ్యులు ఆర్.సురేంద్రకుమార్ హాజరవుతున్నారని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న లైన్‌మన్

గూడెంకొత్తవీధి, జూన్ 16: మండలంలోని సంకాడ కొత్తూరు జంక్షన్ వద్ద విద్యుదాఘాతంతో లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. పెదవలస లైన్‌మన్ పోతురాజు బాలకృష్ణ ఆదివారం మధ్యాహ్నం ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి సంకాడ కొత్తూరు జంక్షన్ వద్ద లైన్ మరమ్మతు పనులులు చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో స్తంభంపై మరమ్మతులు చేపడుతున్న లైన్‌మన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో స్తంభంపై నుంచి కిందకు పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చేర్పగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం లైన్‌మన్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

21న వారపు సంత ఆశీలు వేలం

పెదబయులు, జూన్ 16: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం జరిగే వారపు సంతకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 19న ఆశీల వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయితీ కార్యదర్శి కాశీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గతంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ ఆశీలు వసూలు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం కోడ్ ఎత్తి వేయడంతో నిబంధనలు లేనందున పాడేరు డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి మౌఖిక ఆదేశాల మేరకు వారపు సంత బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల ఆ రోజు ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

గిరి యువత క్రీడల్లో రాణించాలి

చింతపల్లి, జూన్ 16: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని తాజంగి సర్పంచ్ మహేశ్వరి అన్నారు. ఆదివారం తాజంగి పంచాయతీ కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సర్పంచ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన పెటియా సత్తిబాబు జ్ఞాపకార్థం స్థానిక యువకులు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారన్నారు. ఈ టోర్నీలో 30 జట్లు పాల్గొనగా, బ్లాక్ స్క్వాడ్ క్రీడా బృందం ప్రథమ స్థానం సొంత చేసుకుందన్నారు. దీంతో రూ.10 వేల నగదు, జ్ఞాపిక, ద్వితీయ స్థానం సాధించిన స్ట్రైకర్స్ బృందానికి రూ.5 వేల నగదు అందజేశారు. నిర్వాహకులు కౌషిక్, సురేంద్ర, సాగర్, లింగన్నబాబు, రమణ, మాజీ సర్పంచ్ కాంతమ్మ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డుంబ్రిగుడ, జూన్ 16: అపిడమిక్ సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రాంబాబు చెప్పారు. మామిడిపళ్లు, పనసపళ్లు వంటి సీజన్ మొదలైందని ఆయన చెప్పారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నివాస గృహాల్లో వండిన ఆహార పదార్థాలపై మూతలు తప్పనిసరిగా పెట్టాలన్నారు. అలాగే వేడి ఒడబోసిన నీరు మాత్రమే తాగాలని చెప్పారు. దోమలు అభివృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ జల్లాలని ఆయన సూచించారు.